Impact Factor (SJIF): 6.126 E-ISSN: 2583-1615, P-ISSN: 3049-3498

International Journal of Research in Academic World

Received: 29/July/2025 IJRAW: 2025; 4(9):74-77 Accepted: 11/September/2025

# తెలుగు లో చారిత్రక కావ్య రచన

**[*1]డాక్టర్ ద్వివేది కృష్ణ గాయత్రి**

[*1]తెలుగు అధ్యాపకురాలు, A.S.D. మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతి పత్తి), కాకినాడ, ఆంధ్రప్రదేశ్, భారతదేశం.

**సారాంశం**

చారిత్రక కావ్యము అనగా చరిత్రను ఇతివృత్తముగా కలిగిన కావ్యము. చారిత్రక కావ్యాల ద్వారా రాజులు,రాజ వంశాలు, వారి పరిపాలనా విధానాలు తెలుసుకోవడానికి వీలవుతుంది. సంస్కృత భాషలో ఉన్న ఇతిహాసాలు, పురాణాలు, కల్హణుని రాజ తరంగణి మొదలైనవి చరిత్ర ను వివరించే గ్రంథాలు. తెలుగులో వల్లభాభ్యుదయం, ప్రతాపరుద్రీయం, శ్రీ సిద్ధేశ్వర చరిత్ర మొదలైనవి చారిత్రక కావ్యాలు. భారతీయుల చారిత్రక దృష్టిని గురించి రవీంద్రనాథ్ టాగూర్, విశ్వనాధ వంటి వారు వివరించారు. శ్రీ శ్రీ' దేశ చరిత్రలు అనే కవిత లో కూడా భారతీయుల చారిత్రక దృష్టి సమర్థన కనబడుతుంది.ఆధునిక తెలుగు సాహిత్యం లో జాతీయోద్యమ ప్రభావంతో అనేక చారిత్రక గ్రంథాలను కవులు రచించారు. యాత్ర చరిత్రలు, స్వీయ చరిత్రలు ద్వారా సమకాలీన చారిత్రక, సామాజిక స్థితి గతులు తెలుసుకోవడానికి ఆధారమవుతున్నాయి.

**కీలక పదాలు:** చరిత్ర రచనకు సంబంధించిన కావ్యాలు - రాజులు, రాజ వంశాలు,వారి చరిత్రలు - భారతీయుల చారిత్రక దృష్టి - ఇతిహాసాలు, పురాణాలు - పురాణం పంచలక్షణం - క్రోమాన్యాన్ గుహముఖాల్లో చారిత్రక విభాత సంధ్యల మానవ కథా వికాసం - ఆధునిక చారిత్రక కావ్యాలు.

## ఉపోద్ఘాతం

చరిత్ర రచనకు సంబంధించిన కావ్యాలను చారిత్రక కావ్యాలు అంటారు. ఒక పరిమిత కాలంలో జరిగిన సంఘటనలు కానీ, రాజుల దేశ చరిత్రలకు సంబంధించిన ఇతివృత్తంగా కలిగిన కావ్యాలు చారిత్రక కావ్యాలు. “రాజులు రాజవంశాలు, రాజుల నాటి సాంఘిక రాజకీయ సంఘటనలు, సంస్థానాధీశులు, ప్రముఖ వ్యక్తులు, వారి ఇతివృత్తాలు, యుద్ధాలు మొదలైన సంఘటనలు ఆధారంగా వ్రాయబడిన వాటిని చారిత్రక కావ్యాలు అనవచ్చును [1].

## భారతీయుల చారిత్రక దృష్టి:

సంస్కృతం లోని పురాణాలు ఇతిహాసాలు చారిత్రక దృష్టితో రచింపబడినవే. కల్హణుని రాజతరంగిణి, అశ్వఘోషుని బుద్ధ చరిత్ర, భట్టబాణుని హర్ష చరిత్ర, తమిళం లోని పెరియపురాణం, హిందీలోని పృధ్వీరాజ్ రాసో మొదలైనవి చారిత్రిక కావ్యాలుగా చెప్ప బడుతున్నాయి. కానీ భారతీయుల చారిత్రక రచనా దృష్టి గురించి ప్రముఖంగా చర్చించవలసి ఉన్నది. భారతీయులకు చరిత్ర రచనా దృష్టి తక్కువ అని పాశ్చాత్యులు అభిప్రాయపడ్డారు. అయితే వారి అభిప్రాయం సమంజసం కాదు అని శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ రవీంద్రనాథ్ టాగూర్ మొదవైన వారి అభిప్రాయాల వల్ల తెలుస్తోంది. పురాణానికి ఐదు లక్షణాలు ఉంటాయి. "సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ వంశానుచరితం చేతిపురాణం పంచలక్షణమ్" సర్గ, ప్రతిసర్గ, వంశము, మన్వంతరము, వంశానుచరితము అనేవి పురాణానికి ఉంటే ఐదు లక్షణాలు.

సర్గ అనగా సృష్టి ప్రారంభమును వివరించునది ప్రతిసర్గ అనగా సృష్టి లయమై పోయిన తర్వాత పునఃసృష్టిని గురించి తెలియచేయునది. దీనినే ప్రళయాంతర సృష్టి అంటారు. వంశమనగా సృష్టి ప్రారంభము నుండి ఉన్న సూర్య, చంద్రాది వంశములను వివరించునది. మన్వంతరము అనగా యుగము, మహాయుగము, కల్పాదులనుగూర్చి తెలియ జేయునది. 72 మహాయుగాలు ఒక మన్వంతరము 4 యుగాలు ఒక మహాయుగము.

వంశానుచరితము అనగా సూర్య, చంద్రుల రాజవంశముల నుండి ప్రారంభము అయి కలియుగం వరకు కొనసాగిన రాజుల అనువంశముల చరిత్ర. ఇదే చరిత్రకు మిక్కిలి ఆధారమైన అంశము. ఐతే పురాణ ఇతిహాసాలలో కాలాదులు నిర్దిష్టము గా చెప్పబడలేదు. ఇందుకు కారణము తెలియక కాదు. ప్రతిక్షణం జరిగేది చరిత్రే ఐనా దానిని లిఖించడం సాధ్యంకాదు. కాబట్టి

*Corresponding Author: డాక్టర్ ద్వివేది కృష్ణ గాయత్రి

ప్రధానమైన అంశాలు మాత్రమే లిఖింపబడ్డాయి.
ఇతిహాసము అనగా ఇలా జరిగినది అని చెప్పటము అంటే ఇదీ చరిత్రే. భారతీయ ఇతిహాసాలు రామాయణ, మహాభారతాలు. రామాయణ కాలం లో జీవించిన వాల్మీకి ప్రత్యక్షంగాను, తపోదృష్టితోనూ చూసిన తెలుసుకున్న రాముని యొక్క చరిత్రను రచించారు. వ్యాసుడు కూడా ఇదేవిధంగా మహాభారత యుద్ధానంతరం జరిగిన విషయాలు అన్నింటిని లోక హితం కోసం 'జయ ఇతిహాసంగా' భారతం పేర రచించారు. వాల్మీకి, వ్యాసులకు ఆయా చరిత్రలతో సంబంధం ఉంది. ఇతిహాసము అర్థ ప్రధానమైనది అని అగ్నిపురాణంపేర్కొంటున్నది. ఇది బహునాయకాశ్రయం కూడా కావచ్చు. "శాస్త్రే శబ్ద ప్రధానత్వం ఇతిహాసేర్ధనిష్ఠతా అభిధాయ ప్రధానత్వాత్ కావ్యం తాభ్యానిబధ్యతే" వంశాను చరితములో చెప్పబడిన రాజుల క్రమాన్ని అనుసరించిన అనువంశ రాజుల చరిత్రయే ఇతిహాసము అని పూర్వీకుల అభిప్రాయము. రామాయణం లో సూర్యవంశ రాజుల చరిత్ర, భారతం లో చంద్రవంశ రాజుల చరిత్ర చెప్పబడింది. "పరిక్రియా పురాకల్ప ఇతిహాస గతిర్ద్వివిధాస్యాద్యేకనాయకా పుర్వాద్వితీయ బహునాయకా". రాజశేఖరుడు కావ్య మీమాంశలో ఇతిహాసము ఏకనాయకాశ్రయము అని పరిక్రియ బహునాయకాశ్రయము అని వివరించారు. కొందరు చరిత్రకారులు పురాణాలలోని రాజుల కాల ప్రామాణికతను అంగీకరించలేదు.
భారతీయులది ప్రధానంగా ఆముష్మిక దృష్టి. వీరు తారీఖులకు, వంశావళికి, భౌతికమైన విషయాలకు అంతగా ప్రాధాన్యతను ఇవ్వలేదు. అందుకే పాశ్చాత్యులు రచించినట్టుగా నిర్దిష్టంగా కాలాన్ని తెలియచేస్తూ రచింప బడలేదు. ఈ విషయాన్ని Sir Max Muller, Sri Ravindranath Tagore మొదలైన వారు తెలియజేశారు.

"In the following sketch of the history ofthe Vedic literature, I cannot Promise to give dates such as we are accustomed to find in the literary histories of other nations, but I hope I shall be to prove that these exist in the large mass of literature which belongs to the Vedic" age, clear trace of an original historical articulations; and that it is possible to restore something like chronological continuity in the four periods of the Vedic literature [2].
Sri Ravindranath Tagore: "In fact our history has not been of the rise and fall of kingdoms of fights for political supremacy. In our country records of these days have been despised and forgotten for them in no way represent the true history of ourpeople, our history is that of our social life and attainment of spiritual ideas [3] అని తెల్పెను.

శ్రీ రవీంద్రనాధ్ టాగూర్ భారతీయుల చరిత్ర దృష్టి కోణము గురించి పై విధంగా తెలియజేసారు. పురాణాలలో ఉన్న చరిత్రకు నిర్దిష్టమైన చారిత్రక ఆధారాలు దొరకవు అందువలన అవి సత్యాలు కావని పాశ్చాత్యుల అభిప్రాయం కానీ శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారు మొ॥వారు దీనిని అంగీకరించలేదు. "మన పురాణములు చరిత్రయే". మన ఋషులకు చారిత్రక జ్ఞానము లేదనుట మన పూర్వ నాగరికతను ఎంత తక్కువ పరచినచో వారి ఏలుబడి అంత గొప్పగా సాగునని పాశ్చాత్యులు పన్నిన పన్నుగడ. మనవాండ్రకు పురాణములందు చెప్పబడిన సర్గ ప్రతిసర్గల యందు విశ్వాసము లేదు [4].

చరిత్రకారులు పురాణాలను చారిత్రక సత్యాలుగా అంగీకరించక పోయినప్పటికి శ్రీ కంచి పరమాచార్య శ్రీశ్రీ జగద్గురు చంద్రశేఖరేంద్ర మహాస్వామి వారు పురాణాలు సత్యాలని, పౌరాణికాంశాలను కార్యాకారణ సంబంధాన్ని అనుసరించి విశ్లేషిస్తూ పురాణాలను చారిత్రక వాస్తవాంశాలుగా అంగీకరించవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు [5].
"భారతీయులకు చారిత్రక రచనలో విజ్ఞానము, విక్రమము, యశస్సు అనునవి ప్రధానాంశాలు. కానీ పాశ్చాత్యులకు చారిత్రక రచనా విషయములో వ్యక్తుల జీవన మరణాదికములు, జీవిత విధానములు, యుద్ధములు, దండయాత్రలు మున్నగు లోక సంబంధ విషయములు ప్రధానాంశములు" [6].
ధర్మానికి, సాంఘీక చరిత్రకు ప్రాధాన్యతను ఇవ్వడం వలన కవుల కావ్యాలలో లభించే చరిత్రలో మనకు అతిశయోక్తులు, కల్పనలు కనబడుతున్నాయి. కానీ కవి తమ సమకాలీన చరిత్రను విడిచిపెట్టలేడు. అందువలన కల్పనలు ఉన్నప్పటికి చారిత్రక అంశాలను కొంతవరకు స్వీకరించి ఇతర ఆధారాలు విశ్లేషించవచ్చు. శ్రీశ్రీ మహాప్రస్థానం లోని దేశ చరిత్రలు గేయంలో భారతీయుల చరిత్ర కోణాన్ని స్పష్ట పరిచారు.
ఏ యుద్ధం ఎందుకు జరిగిందో?
ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?
తారీఖులు, దస్తావేజులు
ఇవి కావోయ్ చరిత్రకర్థం
ఈ రాణి ప్రేమ పురాణం
ఆ ముట్టడికైన ఖర్చులు
మతలబులు కైఫీయతులూ
ఇవి కావోయ్ చరిత్ర సారం..
........ క్రో మాన్యాన్ గుహముఖాల్లో
చారిత్రక విభాత సంధ్యల
మానవకథా వికాశమెట్టిది ?
ఏ దేశం ఏ కాలం లో
సాధించిన దే పరమార్థం?...
ఆయాకాలాల్లో ఆవిష్కరించిన పరమార్థాన్ని చెప్పేదే దేశచరిత్ర. చారిత్రక కావ్యాలనే కాక కావ్య అవతారికలు, షష్ఠ్యంతాలు, పీఠికలు మొదవైనవి కూడా చరిత్రను ఆవిష్కరిస్తున్నాయి.

## తెలుగులో చారిత్రక కావ్యాలు

భట్ల పెనుమర్తి కోదండ రామకవి'వల్లభాభ్యుదయం' అనే కావ్యాన్ని రచించారు. ఇదే తొలి తెలుగు చారిత్రక కావ్యముగా విమర్శకులు నిర్ణయించారు. ఇది ప్రప్రథమంగా ఆంధ్రదేశాన్ని పరిపాలించిన శ్రీకాకుళాంధ్ర వల్లభుని 'ఆంధ్రవిష్ణువుగా' కీర్తిస్తూ 5 ఆశ్వాసాలలో రచింపబడిన ప్రబంధం. ఇందులో సుమతి, అనంతపాలురల చరిత్రలు కూడా ఉన్నాయి. కోదండ రామకవి గోపాల సచివుని తనయుడు. ఈ కవి కాలాదులను గురించి ఇంకా చర్చించవలసి ఉన్నది. శ్రీనాధుడు రచించిన 'వల్లభాభ్యుదయం' లోని ఒక పద్యాన్ని జగన్నాధ కవి తన 'ప్రబంధ రత్నావళి' లో ఉదహరించాడు. కానీ ఈ గ్రంధం అలభ్యం. తరువాతది కన్నడ గ్రంధానికి అనువాదమైన 'నవచోళ చరితము': దీనిని పోశెట్టి లింగన కవి రచించారు. వీరి తల్లి పార్వతి తండ్రి రుద్రుడు. పోశెట్టి లింగనకవి గార్లపాటి లక్ష్మణకవి శిష్యుడు.

నవచోళ చరిత 5 ఆశ్వాసాల ద్విపద కావ్యము. ఇందులో తొమ్మిదిమంది చోళరాజుల చరిత్ర మరియు శివభక్తుల చరిత్ర వివరింప బడింది. క్రీ.శ. 15వ శతాబ్దమునకు చెందిన ఏకామ్రనాథుడు "ప్రతాప రుద్రీయ', కాసెసర్వప్ప 'శ్రీ సిద్ధేశ్వర చరిత్రం' తరువాత చెప్పవలసినవి. ఇవి ఆంధ్ర సామ్రాజ్యాన్ని పరిపాలించిన కాకతీయ చక్రవర్తుల చరిత్ర. అయితే ఇందులో కొన్ని సంఘటనలకు చారిత్రక ఆధారాలు లేవు అంటారు ద్వా. నా. శాస్త్రి గారు.

శ్రీనాథుడు రచించిన 'పల్నాటి వీర చరిత్ర' అనే ద్విపద కావ్యం సుప్రసిద్ధమయినది. మరో భారతంగా చెప్పబడే పల్నాటి వీరుల చరిత్రను తెలియ చేస్తుంది. ఇది కూడా దాయాదుల మధ్య రాజ్యం కోసం జరిగిన కలహమే. జూదానికి బదులు కోడి పందాలు ఉన్నాయి. భారతంలో పాండవులు 12 సం॥లు అరణ్యవాసం 1 సం॥ అజ్ఞాతవాసం చేస్తే ఇందులో బ్రహ్మనాయుడు మొదలైన వారు 7 సం॥లు అరణ్యవాసము చేసారు. పౌరుష పరాక్రమాలకు ప్రతిరూపంగా పల్నాటి పోరు సాగింది.

17వ శతాబ్ది వారుగా ఊహిస్తున్న గంగుల పిన ఎల్లయ 13వ శతాబ్దికి చెందిన 'కాటమరాజు కథ' ను మంజరి ద్విపదగా రచించారు. ఇందులో నల్ల సిద్ధిరాజు తిక్కన సోదరుడైన ఖడ్గ తిక్కనయే అంటారు నాగయ్య గారు. ఇది జానపద గాథ. సంతానం కోసం, వర్షాల కోసం గొల్ల సుద్దులచే ఈ కథ చెప్పించడం లోకం లో ఆనవాయితీగా ఉందని ద్వా.నా.శాస్త్రి గారు అంటారు.

శ్రీకృష్ణదేవరాయల చరిత్రను, ఆ కాలం నాటి స్థితిగతులను విశ్వనాథ స్థానాపతి రచించిన 'రాయవాచకం', కుమార ధూర్జటి (క్రీ.శ. 1650) 'కృష్ణరాయ విజయము' ద్వారా తెలుస్తున్నవి. అందుగల వెంకయ్య గారు రచించిన 'రామరాజీయము' ఆరవీటి వంశీయులు అయిన అళియ రామరాయ కాలం నాటి పరిస్థితులను తెలియచేస్తోంది. కృష్ణదేవరాయల అల్లుడు అళియ రామరాయలు. తళ్లికోట యుద్ధ సమయం లో అళియ రామరాయలు చూపిన పరాక్రమం వర్ణించబడినది. ఇందులో రామరాయల మరణం గురించి చెప్పబడలేదు. రామరాజీయమునకు నరపతి విజయం అనె నామాంతరము కలదు. ఇది కోదండరామరాజు కి (క్రీ.శ.1630) అంకితము ఇవ్వబడినది. ఆరవీటి వంశ శాఖలలో ఒకటైన అవుకు వంశావళిని దోనూరు కోనేరు నాథ కవి గారు బాల భాగవతం కు అనుబంధముగా వర్ణించారు. వెలుగోటి వారి వంశావళి వంశావళులులో సుప్రసిద్ధమైనది [7] అని నాగయ్య గారు పేర్కొన్నారు. అవుకు వంశము ఆరవీటి వంశ శాఖలలో ఒకటి.

దక్షిణాంధ్ర దేశ చరిత్రలలో విజయ నగర రాజుల తర్వాత తెలుగు భాషా సాహిత్యాలను, కళలను పోషించిన తంజావూరు రాజుల చరిత్ర ప్రసిద్ధము. తంజావూరు నాయకరాజులలో రఘునాథ నాయకులు పండిత కవి, కవి పోషకుడు. రఘునాథ నాయకుడు నలచరిత్ర అవతారికలో తన తండ్రి యొక్క చరిత్రను 'అచ్యుతాభ్యుదయం' అనే పేరుతో రచించినట్లు పేర్కొన్నాడు. కానీ ఈ గ్రంథం అలభ్యం. ఇతని పుత్రుడు విజయరాఘవ నాయకుడు (క్రీ.శ.1633-1673). ఇతనికి మన్నారుదాసు అని నామాంతరం కూడా కలదు. ఈయన'రాఘవాభ్యుదయం' 'రఘునాథాభ్యుదయం' అనే కావ్యాలను రచించాడు. రంగాజమ్మ రచించిన 'మన్నారు దాస విలాసం', పోనేటి దీక్షితచంద్రుడు రచించిన 'విజయ రాఘవ కళ్యాణం', కామరసు వెంకటపతి సోమయాజి రచించిన 'విజయ రాఘవ చంద్రికా విహారం' తంజాపుర రాజుల కుటుంబాలని గురించి, యుద్ధాలు, దినచర్య, పరిపాలన మొ॥ విషయాలను తెలియచేస్తున్నాయి. వీరి కాలంలో అనేక యక్షగానాలు, ద్విపదలు వెలువడ్డాయి. పాల్కురికి సోమన్న రచించిన 'పండితారాధ్యచరిత' 'బసవ పురాణము', వినుకొండ వల్లభాచార్యుని 'క్రీడాభిరామము' ఆనాటి సాంఘిక చరిత్ర ను తెలియ చేస్తున్నాయి. కాబట్టి వీటిని కూడా చారిత్రక గ్రంధాలుగా చెప్పవచ్చును. కానీ కొందరుసాహితీవేత్తలు ఇందుకు అంగీకరించడము లేదు. చారిత్రక కావ్య రచన చేసిన కవులలో కొందరు తత్కాలీన సమకాలికులు. మరికొందరు తరువాతి కాలంలో చారిత్రక అంశాల తోనో, పోషకుల యొక్క కోరికపైనా ప్రేరణపొంది రచించారు. ఈ కావ్యాలలో కల్పనలు ఎక్కువగా ఉండడం వలన చరిత్రను నిర్ణయించ లేనప్పటికి చరిత్రకారులకు తెలియని క్రొత్త అంశాలను కుండా ఈ కావ్యాలు వెలుగులోకి తెచ్చాయి. తెలుగు భాషా సంస్కృతులను తెలుసుకోవడానికి ఆధారము అవుతున్నాయి. ఈ కావ్యములు మిక్కిలి రసవత్తరములు "తెలుగు సారస్వతమున చారిత్రక కావ్యములు ప్రత్యేక శాఖగా ఏర్పడి తెలుగు వారి చరిత్రను కావ్యరూపమున మనకు అందించినవి. ఇవి విస్తృతమైన ఆంధ్రుల చరిత్రను తెలుపుటయే కాక చరిత్రకారులకు సహితము తెలియని కొన్ని నూతనాంశములను వ్యక్తపరచుచున్నవి" అని డా॥ అరుణకుమారి గారి ఉపసంహారక వాక్యాలు సర్వజనామోదయోగ్యములు [8].

## ఉప సంహారం

ఆధునిక కాలం లో కూడా చారిత్రక కావ్యాలు వచ్చాయి. అయితే 18వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామికీకరణ, ఆంగ్ల సాహిత్య ప్రభావం, జాతీయోద్యమం మొదలైనవి తెలుగు సాహితీవేత్తలను ప్రభావితం చేసాయి. భారతీయుల ఆత్మను పట్టుకుని దేశ చరిత్రలను రచించిన వాడు శ్రీశ్రీ. ఇది ఆధునిక చరిత్రకారులకు మార్గదర్శి. ఇంకా జాతీయోద్యమ ప్రభావంతో పూర్వ చారిత్రక వైభవాన్ని కవిత్వం ద్వారా ప్రచారం చేయడం ప్రజల లో దేశభక్తిని పెంపొందించడం ఈనాటి ప్రధానమైన అంశము అయినది. ఈ లక్ష్యం తో పురావస్తు ఆధారాలు, దేశ, విదేశీ చరిత్రకారుల రచనలలోని ఆధారాలను పరిశీలన చేసి ఆధునిక కవులు చారిత్రక కావ్యాలు రచించారు. శతావధాని, స్వాతంత్ర్య సమరయోధులు ద్వివేది సత్యకవి గారు రచించిన 'ఆంధ్రప్రతిష్ఠ', కళాప్రపూర్ణ మధునాపంతుల వారి 'ఆంధ్రపురాణం', తరువాత కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి 'ఆంధ్ర ప్రశస్తి', కొడాలి ఆంజనేయులు గారి 'హంపీక్షేత్రం', ఆచార్య సి.నారాయణ రెడ్డి గారి 'నాగార్జున సాగర్' మొదలైన రచనలు, పుట్టపర్తి వారి 'పెనుగొండ లక్ష్మి' (ఖండకావ్యం), 'మేఘదూతం' వంటి కవితలు ఇలా ఎన్నో మహాకావ్యాలు, ఖండకావ్యాలు, కవితలు వెలువడ్డాయి. ఏనుగుల వీరాస్వామి గారి 'కాశీ యాత్ర' రచనతో వచన ప్రక్రియ లో యాత్రా చరిత్రల రచన ప్రారంభం అయ్యింది. వీటి వలన పర్యాటకుల అనుభవాల తో పాటు క్షేత్ర మాహాత్మ్యములు, స్థల పురాణాలు కూడా తెలుస్తున్నాయి. పురాణాలలోను, కాశీఖండం, భీమఖండం వంటి గ్రంథాలలోను తీర్థ, క్షేత్ర మాహాత్మ్యములు వర్ణించబడినవే. స్వీయ చరిత్రలు, ఆత్మానుభవాలతో పాటు సమకాలీన సామాజిక చరిత్రకు దర్పణాలు అయ్యాయి. జీవిత చరిత్రలు కూడా చరిత్రను

తెలియజేస్తున్నాయి. P.V. నరసింహా రావు గారు రచించిన 'INSIDER' వంటి గ్రంథాలు వివిధ పదవులలో, ఉద్యోగాలలో సేవలు అందించిన వారి అనుభవాలను, కథలుగా, నవలలుగా వ్రాస్తున్న వారు కూడా చరిత్ర రచన చేస్తున్నట్టే. అయితే, వాటన్నిటిలో యదార్థ చరిత్రను అవగతం చేసుకోవలసిన బాధ్యత పాఠకులది మరియు సమకాలీన చరిత్రను సమీక్షిస్తున్న విమర్శకులది కూడా.

**అథోజ్ఞాపికలు (Foot Notes)**

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా. నా. శాస్త్రి గారు - పుట - 247.
2. Ancient Sanskrit Literature – Sir Max Muller Page-57
3. Nationalism – Sri Rabindranath Tagore- Page-6
4. పీఠిక - పురాణవైరి గ్రంధమాల- శ్రీ విశ్వనాధ సత్యనారాయణ
5. "Hindu Dharma" - English Translation of 'Deivathin kural', a collection of Invaluable and engrossing speech - శ్రీ కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ జగద్గురు చంద్రశేఖరేంద్ర మహాస్వామి.
6. స్త్రీ తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య గారు - పుట - 316
7. సాహిత్య సమీక్ష - నాగయ్య గారు - పుట – 389
8. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా. నా. శాస్త్రి గారు- పుట - 249

**సూచన (References)**


1. తెలుగు సాహిత్య చరిత్ర - శ్రీ ద్వా. నా. శాస్త్రి
2. చారిత్రక కావ్యములు Dr.P.Aruna Kumari
3. తెలుగు సాహిత్య సమీక్ష - Sri G.Naagayya
4. దేశ చరిత్రలు - Sri Sri gaaru.
5. A History of Ancient Sanskrit Literature – Sir Max Muller.